
# దేవుడి ఫొటో

-డాక్టర్ ఎమ్.సుగుణరావు



**ఫ్లైటు దిగగానే చెక్ అవుట్ అయి తన సామాను తీసుకుని బైటకొచ్చాడు అరవింద్. రాగానే కళ్ళు ఆత్రంగా చినమావయ్యకోసం వెదికాయి. ఎదురుగా టాక్సీ దగ్గర నుంచు న్నాడు. అరవింద్‌ని చూసి గబగబా వచ్చి సామాను అందుకుంటూ "బావున్నావురా!" అన్నాడు.**

"నేను బాగానే వున్నాను, ఇంతకీ నేను అడిగింది దొరికిందా" అన్నాడు.

ఆ మాటలకు ఆయన క్షణం సేపు ఆలోచించి "దొర కలేదురా, అన్నిచోట్ల గాలించాను, మన వాళ్ళంద రినీ అడిగాను, విజయనగరంలో మీ నాన్న స్నేహితుడున్నాడు ఆయన దగ్గర దొరకొచ్చు, వీలయితే మీ నాన్న సొంత ఊరు విజయనగరం దగ్గర జామి, నువ్వే ఒకసారి వెళితే బావుంటుంది" అన్నాడు.

ఆ మాటలతో, అరవింద్‌లో దిగులు మేఘం. రెండే ళ్ళుగా చేస్తున్న ప్రయత్నం ఫలించలేదనే బాధ. టాక్సీ ఎక్కాడు. మనసులో ఏదో తెలీని గుబులు. ఇంటికి వచ్చే వరకూ ఆలోచనలు వద లేదు.

ఇంటికి రాగానే అత్తయ్య అరవింద్ ముఖావంగా ఉండడం చూసి "ఏంట్రా హుషారుగా లేవు!?" అంది.

- వెంటనే మావయ్య... "నీకు తెలుసు కదా పాపం రెండేళ్ళ నించీ వీడు దేనికోసం వెతుకుతున్నాడో... అది దొరకలేదని బెంగ..." అన్నాడు. ఆ మాటలకు ఆమె అరవింద్ వంక జాలిగా చూసి "దొరుకుతుందిలే నాన్నా కంగారు పడకు" అంది. అరవింద్ మౌనంగా తన సామానుంచిన గదిలోకి వెళ్ళి తలుపేసుకుని దిగాలుగా మంచం మీద వాలాడు. అత డికి మెటిల్డా గుర్తుకొచ్చింది. 'అసలు తను చేస్తున్న ప్రయత్నాలకు మూలం మెటిల్డా. తను చేస్తున్న సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులో తనతో సన్నిహితంగా వుండే అమెరికా అమ్మాయి. ఒకరోజు కంప్యూటర్‌లో ఏవో ఫొటోలు లోడ్ చేస్తూ కనిపించింది. "ఏం చేస్తున్నావ్?" అని అడిగేడు తను. "మా మమ్మీ, డాడీల ఫొటోలతో నా చిన్నప్పటి ఫొటోలు మిక్స్ చేసి సిడి తయారుచేస్తున్నాను" అంది. "దేనికీ అన్నాడు? తను ఆశ్చర్యంగా". "నా చిన్నప్పుడే నా తల్లితండ్రులు ఏక్సిడెంట్లో పోయారు. వారితో నేను చిన్నప్పుడు తీయించుకున్న ఫొటోలు లేవు. అందుకే ఆ పని ఇప్పుడు చేస్తున్నాను. అలా వారితో కల్సి వున్న ఫొటోలు చూస్తుంటే నేను బాల్యం లోనే వారిని పోగొట్టుకున్న బాధ దూర మవుతుంది" అంది మెటిల్డ్.

ఉగాది పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

- ఆరోజు మెటిల్డా మాటలతో అత డిలో అలజడి. 'తనూ, మెటిల్డా ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నారు. తను ఈ భూమ్మీద పడిన కొద్ది గంటల్లోనే తల్లిని కోల్పోయాడు. ఆ తర్వాత తండ్రినీ పోగొట్టుకున్నా నని పెదమావయ్య చెప్పేవాడు. తనకు రెండేళ్ళ వయస పుడు పెదమావయ్య అమెరికా తీసుకొచ్చాడు. ఆయనకు పిల్లల్లేక పోవడంతో తనను దత్తతీసుకున్నారు. తనకు తల్లితండ్రులు గుర్తుకు రానంతగా మావయ్య అత్తయ్య తనను పెంచారు. పుట్టింది లగాయితు ఈరోజువరకూ తనకు తల్లితండ్రుల్లేరనే బాధ ఎప్పుడూ కలగలేదు. తన పుట్టిన రోజప్పుడు మాత్రం దేవుడి గదిలో వుండే అమ్మ ఫొటోకి మావయ్య దండం పెట్టించేవాడు. తను నాన్న ఫొటో ఏది మావయ్యా అనడిగితే ఆయన సమాధానం చెప్పేవాడు కాదు. నాన్న విషయం ఎత్తితే ఆయన ముభావంగా అయిపోయేవాడు. పెదమావయ్యతో తను ఐదేళ్ళకోసారి ఇండియా వచ్చేవాడు చినమావయ్య వైజాగులో వుంటాడు. ఆయనా తనను బాగా చూసుకుంటాడు. తనకు ఏ లోటూ లేదు. అమెరికాలో మంచి ఉద్యోగం. వడ్డించిన విస్తరిలాంటి జీవితం. అయితే మెటిల్డా తయారుచేస్తున్న ఫొటో ఆల్బం చూసిన ప్పటి నించీ తనలో ఏదో వెలితి తనూ తన అమ్మా, నాన్నల ఫొటోలతో తన ఫొటో కల్పి ఒక ఆల్బం తయారు చెయ్యాలనే ఆశ కలిగింది. ఆ ఆశ రోజు రోజుకీ తీవ్రరూపంగా మారి తనలో బలంగా ఆ కోరిక నాటుకుపోయింది. మరయితే నాన్న ఫొటో ఏది? అమ్మ ఫొటోలు చాలా ఉన్నాయి, నాన్న ఫొటో ఒక్కటీ లేదు. నాన్న ఎలా ఉంటారో తనకి తెలీదు. జన్మనిచ్చిన తండ్రిని తను చూడలేదు. కనీసం ఆయన ఫొటో అయినా దొరకకపోవడంతో తనకు దుఃఖం వస్తోంది. రెండేళ్ళుగా చెయ్యని ప్రయత్నం లేదు. ఎంతో మందితో ఫోన్‌లో మాట్లాడేడు. ఈ మెయిల్స్ ఇచ్చాడు. ఉత్తరాలు రాసాడు చినమావయ్యను ఫొటో సంపాదించ మని పదే పదే అడుగుతున్నాడు. నాన్న ఫొటో గురించి తను ఎయిర్‌పోర్టులో అడగ్గానే ఆయన దొరకలేదని చెప్పడంతో మరింత నిరాశ కలి గింది. తను ప్రత్యేకంగా ఏ పనీ లేకపోయినా ఇండియాకు రావడానికి కారణం నాన్న ఫొటో సంపాదిం చాలనీ... కానీ ఎలా? 'అలా ఆలోచిస్తూనే ప్రయాణపు బడలికతో నిద్రలోకి జారుకున్నాడు అరవింద్.

* * *

వైజాగ్‌కు వచ్చిన రెండోరోజే చినమావయ్య ఇచ్చిన అడ్రసుతో విజయనగరం టాక్సీలో బయలుదేరాడు అర వింద్. తన తండ్రి స్నేహితుడైన జగన్నాథంగారి ఇల్లు అతనికి తేలిగ్గానే దొరికింది.

రంగు వెలిసిన పాత డాబా ఇల్లు. ఇంటి ముందు చిన్న గేటు లోపలకు వెళ్ళి "జగన్నాథంగారున్నారా..." అన్నాడు. ఒకమ్మాయి బైటకొచ్చి "నాన్నగారు పూజ చేస్తు న్నారు, క్షణం కూర్చోండి" అంటూ లోపలకు వెళ్ళింది.

అరవింద్ గది వంక పరీక్షగా చూసాడు. ఇంకా పాత వాసనలు పోని మండువా లోగిలి. సున్నాలు లేక పెచ్చు లూడిపోయిన గది గోడలు. పుస్తకాలున్న చెక్క బీరువా. గది మధ్యలో ఉయ్యాల మంచం.

- ఐదు నిమిషాల తర్వాత ఒక పెద్దాయన వచ్చాడు. బాగా తెల్లబడిన జుట్టు సన్నగా పొడుగ్గా వున్నాడు. అర వయ్యేళ్ళ వయసుంటుంది. ఆయన అరవింద్‌ని పరీక్షగా చూస్తూ, "ఎవరు బాబూ మీరు?" అన్నాడు.

"నా పేరు అరవింద్, సత్యంగారి అబ్బాయిని, ఆయనా మీరు చిన్నప్పటి నించీ మంచి స్నేహితులట కదా?" అన్నాడు.

"సత్యమా!" అంటూ ఆయన ఒక్కసారి ఆలోచనల్లో పడి అరవింద్ వంక దృష్టి సారిస్తూ ఆనందంగా నవ్వేడు. నవ్వుతున్న ఆ కళ్ళల్లోని వెలుగు గమనించాడు అరవింద్. క్షణంసేపు కళ్ళు మూసుకుని, ట్రాన్స్ లోంచి బైటకు వచ్చిన వాడిలా, "సత్యం ఒక చైతన్యం, ఒక వేకువ కిరణం అతడిని నా స్నేహితుడిగా చెప్పుకునేందుకు గర్వపడతాను, ఉద్యమాల వెంట నడుస్తూ ముందుకు వెళ్ళిపోయాడు, ఆ అడుగులు తిరిగి వెనక్కు పడలేదు." అన్నాడాయన అరవింద్ వంక ఆపేక్షగా చూస్తూ.

"ఆయన ఫొటో మీ దగ్గర దొరుకుతుందేమోనని వచ్చాను" అంటూ అరవింద్ తన మనసులో మాట బైట పెట్టేసాడు. ఆయన క్షణంసేపు ఆలోచించి... "మీ నాన్న ఫొటోలన్నీ మీ మావయ్య వాళ్ళ ఇంట్లో వుండేవి. మీ నాన్న పూర్తిగా ఉద్యమంలో మమేకపయిపోవడంతో పోలీసు రికార్డుల్లో విప్లవకారుడనే ముద్ర పడిపోయింది. దాంతో మీ నాన్న అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. ఆయన్ని వెదుకుతూ వచ్చిన పోలీసులు మీ వాళ్ళ ఇంట్లో ఆయన ఫొటోకోసం వెదికారు. మీ మావయ్యవాళ్ళు వాటిని దాచేసి ఆ తర్వాత కాల్చేసారని తెల్సింది." ఆయన చెప్పిన ఆ మాటలతో అరవింద్‌లో మళ్ళీ దిగులు మొదలయ్యింది. తన తండ్రి గురించిన క్రొత్త నిజం ఆయన నోటివెంట వినడంతోపాటూ ఫొటోలూ దొరకవని అర్థం అయ్యేసరికి అతడిలో బాధ మరీ ఎక్కువ అయింది. తన తండ్రి విషయం అడిగితే తన మావయ్య ఎందుకు ముభావంగా అయియేవాడో ఇపుడు అతనికి అర్థమయి మనసు అదోలా అయింది. అరవింద్ ముఖంలోని దిగులు గమనించిన ఆయన, "బాబూ మీ నాన్న ఫొటోకోసం ఇంత దూరం వచ్చినందుకు సంతోషం. కరిగిపోయే కాలానికి చెరిగిపోని సాక్ష్యం ఫొటో... అది తప్పక దొరుకుతుంది, జామి అనే ఊరు ఇక్కడికి ముప్ఫైకిలోమీటర్లు, అది మీ నాన్న స్వస్థలం. మీ తాత, నానమ్మ పోయి చాలా ఏళ్ళయింది. మీ నాన్న రక్త సంబంధీకులు ఇంకా ఆ ఊళ్ళో చాలామంది ఉన్నారు. అక్కడ ప్రయత్నించు" అన్నాడాయన ఆ ఊళ్ళో తమ బంధువుల అడ్రసు రాసి ఇస్తూ. ఆయనకు నమస్కారం చేసి ఆ ఇంట్లోంచి బైటపడ్డాడు అరవింద్.

- అరగంట తర్వాత టాక్సీలో జామి చేరుకున్నాడు అరవింద్. జగన్నాథంగారు చెప్పిన గుర్తుల ప్రకారం ఊరుకు ఆనుకునే ప్రవహిస్తున్న గోస్తనీ నది. ప్రక్కనే శివాలయం. దానికి కొంచెం దూరంలో పెద్ద అరుగులున్న పెంకుటిల్లు. ఇంటి ముందు పశువులశాల. గబగబా లోపలకు వెళ్ళాడు. ఒక ముసలావిడ మంచం మీద గుడ్డ పరిచి వడియాలు ఎండబెడుతోంది. అరవింద్‌ని ప్రశ్నార్థకంగా చూసి "ఎవరు బాబూ నువ్వు?" అంది.

"నేను సత్యంగారి అబ్బాయిని" అన్నాడు. ఆమె అతడివంక ఆశ్చర్యంగా చూసి, "సత్యం కొడుకు వచ్చాడయ్యో..." అంది గట్టిగా. ఆవిడ కన్నా కొంచెం వయసులో పైబడిన ముసలాయన వచ్చి అరవింద్‌ని పరీక్షగా చూసి, "అచ్చం మీ నాన్న లాగే ఉన్నావ్, నేను మీ నాన్న చిన్నాన్నను" అంటూ అరవింద్ వళ్ళంతా తడిమాడు. ఆ ముసలావిడ కుర్చీ తీసుకొచ్చి వేసింది.

అతడొచ్చిన వార్త క్షణాల్లో ఆ ఊరంతా తెలిసింది. బిలబిలమంటూ వచ్చారు పాతిక మంది పైగా బంధువులు. ఒకావిడ ఉడికించిన వేరుశనగ కాయలు గిన్నె నిండా పోసి తీసుకొచ్చింది. ఒక ముసలాయన కొబ్బరి బొండాలు తీసుకొచ్చి తాగమన్నాడు. "భోంచేసి వెళతాడు కోడిని కొయ్యండి" అన్నారెవరో.

అరవింద్ వారి ఆప్యాయతకు ఉక్కిరి బిక్కిరయ్యాడు.

"అమ్మా మీ ఆదరణకు నేను చలించిపోయాను. ఇంతకాలం ఎందుకు ఈ ఊరు రాలేదా, అని బాధపడుతున్నాను, నేను ఒక పని మీద వచ్చాను. మీ ఇళ్ళల్లో ఎవరి దగ్గరైనా మా నాన్న ఫొటో వుందా, వుంటే దయచేసి ఇవ్వండి..." అన్నాడు.



"బాబూ మీ నాన్న ఫొటోకోసం ఇంత దూరం వచ్చినందుకు సంతోషం. కరిగిపోయే కాలానికి చెరిగిపోని సాక్ష్యం ఫొటో... అది తప్పక దొరుకుతుంది, జామి అనే ఊరు ఇక్కడికి ముప్ఫైకిలోమీటర్లు, అది మీ నాన్న స్వస్థలం. మీ తాత, నానమ్మ పోయి చాలా ఏళ్ళయింది. మీ నాన్న రక్త సంబంధీకులు ఇంకా ఆ ఊళ్ళో చాలామంది ఉన్నారు. అక్కడ ప్రయత్నించు"

- అరవింద్ మాటలకు వచ్చిన వారంతా ముఖముఖాలు చూసుకున్నారు. కొంతమందికి అతడేం అడుగుతున్నాడో అర్థంకాలేదు. రెండు నిమిషాలు వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకొని "ఫొటో లేదు బాబూ..." అనేసారు. అరవింద్‌కు ఆ మాటలతో అంతవరకు తనలో మిణుకు మిణుకుమంటున్న ఆ ఒక్క అవకాశం అడుగంటిపోయింది అనుకుంటూ బాధపడుతూ కూర్చున్నాడు. వచ్చిన వాళ్ళలో ఒక పెద్దాయన అరవింద్ ముఖంకేసి చూసి, "నాతో రా నాయనా" అంటూ బైటకు తీసుకువచ్చాడు. అరవింద్‌కు ఏమీ అర్థంకాలేదు. ఆయన మెల్లగా నడుచుకుంటూ ఆ ఊరి మొదట్లో వున్న రావి చెట్టు దగ్గర ఆగిపోయి, దూరంగా కనిపిస్తున్న గోస్తనీ నదికేసి చూపిస్తూ "బాబూ అది గోస్తనీ నది, తగరపు వలసలో సముద్రంలో కలిసిపోతుంది. ఇక్కడ మునిగిపోతే శవంగా తేలేది అక్కడే" అంటూ ఆయన క్షణం సేపు చెప్పడం ఆపి, ... "సరిగ్గా ముప్పయ్యేళ్ళ క్రితం నా కొడుకు పదిహేనేళ్ళవాడు, ఈత కొట్టడానికి ఈ ఏరులో దిగాడు. ఏమయ్యిందో ఏమో, చేతులు పైకెత్తి రక్షించండి... అంటూ అరిచాడు. ఆ సమయంలో మీ నాన్న ఈ ఏటి గట్టు మీద కొచ్చాడు, నిండు చూలాలయిన మీ అమ్మను చూద్దామని,... దూరంగా పోలీసులు... అప్పుడు మీ నాన్నేం చేసాడనుకున్నావ్" అంటూ ఆయన చెప్పడం మళ్ళీ ఆపి అరవింద్ ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు. అరవింద్‌లో ఏదో ఉద్వేగం. ఇంతవరకూ తన తండ్రి గురించి తెలీని ఒక సంఘటన గురించి ఆ పెద్దాయన వివరిస్తున్నతీరే అతడికి ఆశ్చర్యం కలిగించింది. చెపుతున్న ఆయనవంకే చూస్తూ, "ఏమయ్యిందండీ అప్పుడు" అన్నాడు.

"మీ నాన్న చెప్పులు విడిచి పెట్టి వేగంగా ప్రవహిస్తున్న నదిలోకి దూకాడు. నా కొడుకు రెక్క పట్టుకొని ఒడ్డుకు లాక్కొచ్చాడు. మీ నాన్నకోసం చూస్తున్న పోలీసులు ఆయన ఒడ్డుకు రాగానే తమవెంట తీసుకుపోయారు.ఆ తర్వాత ఏమయ్యాడో ఎవరికీ తెలీదు." - చెప్పడం పూర్తిచేసి తన కళ్ళు తుడుచుకున్నాడు ఆ పెద్దాయన.

ఆయన చెప్పిన విషయంతో అరవింద్ గుండెలు బరువెక్కాయి. తన తండ్రి జీవితం అలా విషాదంగా ముగిసినందుకు బాధకు లోనయ్యాడు. క్షణం సేపు మౌనంగా ఉండిపోయాడు. అతడి మెదడు పని చెయ్యడం మానేసింది.

నిర్లిప్తంగా వున్న అరవింద్ భుజం తట్టి, "... బాధ పడకు బాబూ... నాతోరా" అంటూ కొంచెం దూరంలో వున్న ఒక డాబా ఇంట్లోకి తీసుకువెళ్ళాడు.

తన మనసులో దిగులు క్షణం ఎక్కువవడంతో అతడు స్థబ్దుగా అయిపోయి అయోమయంగానే ఆయన వెంట నడిచాడు. ఆయన గదులన్నీ దాటుకుంటూ దేవుడి గది దగ్గర ఆగిపోయాడు. తన తండ్రి ఫొటో ఆ గదిలో వుంటుందని అరవింద్‌కు ఆశ కలిగింది. దేవుడి మంటపం మీదున్న చెక్క పెట్టె తెరిచాడాయన. ఆ పెట్టెలోని వాటికేసి చూసిన అరవింద్‌కు ఆశ్చర్యం కలిగింది. అవి ఒక చెప్పుల జత. అరవింద్ ముఖంలోని ఆశ్చర్యాన్ని గమనించిన ఆయన చెప్పడం మొదలుపెట్టాడు.

"బాబూ మీనాన్న ఈ చెప్పులు విడిచిపెట్టి నదిలోకి దూకాడు. తనకు ఎదురుగా పోలీసులు. తను వారి నుంచి తప్పించుకు పారిపోవచ్చు, అయినా అవతల ప్రాణాపాయ స్థితిలో, నదిలో మునిగిపోతున్న నా కొడుకుని రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇతరులకోసం తన ప్రాణాన్ని పణంగా పెట్టడానికి వెనుకాడని మీ నాన్న జ్ఞాపకంగా ఈ చెప్పులు నేను ఇన్నేళ్ళూ దాచుకున్నాను. మీ నాన్న దేవుడు బాబూ,... దేవుడికి ఎవరైనా ఫొటో తీసారా? దేవుడు ఇలా ఉంటాడని ఊహించుకుంటాము, నిజంగా దేవుడి ఫొటో తీసిన వాళ్ళున్నారా? మా అందరి మనసుల్లోనూ దేవుడిలా కొలువై వున్న మీ నాన్నకు వేరే ఫొటో ఎందుకు?" అన్నాడాయన.

- ఆ పెద్దాయన మాటల్లోని అంతరార్థం అవగతం చేసుకున్న అరవింద్ మనసు ఇపుడు ప్రశాంతంగా ఏ అలజడి లేకుండా వుంది.ఒక్కసారి తండ్రి చెప్పుల్ని స్పృశించాడు. చెప్పుల్లోని తన తండ్రి పాదముద్రలు తాకేసరికి అతనిలో ఏదో ఉద్వేగం. ఆ పెద్దాయనకు కృతజ్ఞతలు చెప్పి ఆ ఇంట్లోంచి బైటకు నడిచాడు అరవింద్.

- దూరంగా పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న గోస్తనీ నది. శివాలయంలో మధురంగా వినిపిస్తున్న గంటల చప్పుడు. పశువుల్ని మేపుకుంటూ వెళుతున్న ఓ కుర్రవాడు ఏదో పాట అందుకున్నాడు. ఆకాశంలో మబ్బులు తేలిపోతున్నాయి. పక్షులు బారులుగా సాగుతూ కిలకిలమని శబ్దం చేస్తున్నాయి.

- ఆ వాతావరణపు హాయిని అనుభవిస్తూ నడుస్తున్న అరవింద్‌లో పట్టరాని సంతోషం. అది ముఖంలోకి తన్నుకుంటూ రావడంతో అతని కళ్ళు ఆనందంతో తడిసాయి. తడిసిన ఆ కళ్ళకు ఇపుడు అతడి తండ్రి ముఖం స్పష్టంగా కనిపిస్తోంది, ఫొటో తీసినట్టుగా.

★